# ఆశ్రమం

ఉదయం అయిదింటికే రఘురాంని నిద్ర లేపాను. "ప్లీజ్ అరుణా-ఇంకొద్ది సేపు నిద్ర పోనీ" అన్నాడు దుప్పటి ముఖం మీదికి లాక్కుంటూ.

"లాభం లేదు. తొందరగా లే. మనం ఈ రోజు స్వామీజీ వారి ఆశ్రమానికెళ్ళాలి. ఆరింటికల్లా హోమం ప్రారంభమవుతుంది. లే త్వరగా" అంటూ దుప్పటి లాగేశాను.

మేం బయల్దేరే సమయానికి పిల్లలింకా లేవలేదు. వాళ్ళ విషయం వాళ్ళ నాయనమ్మ చూసుకుంటానంది.

స్వామీజీ ఆశ్రమం హైద్రాబాదుకు ఇరవైకిలోమీటర్ల దూరంలో ఉంది. వనస్థలిపురం దాటాక మరో ఆరు కిలోమీటర్లు ముందుకెళ్లి, కుడివైపుకు తిరిగితే-విశాలమైన యాభై ఎకరాల స్థలంలో ఉందా ఆశ్రమం.

మేం వెళ్ళేటప్పటికే ఆశ్రమం వెలుపల చాంతాడంత క్యూ ఉంది. ఇసుక వేస్తే రాలనంత జనం-తిరునాళ్ళలోలా . . . ప్రవేశరుసుం రెండొందలు కట్టి ఇద్దరం లోపలికెళ్ళాం.

ఓ ఎత్తైన వేదిక ముందు వందలమంది భక్తులు కూచుని ఉన్నారు. రఘు మగవాళ్ళ వరుసల్లో వెనక్కి వెళ్ళి బాసింపట్టు వేసుకుని కూచున్నాడు. నేను ముందుకెళ్ళి వేదికకు దగ్గరగా కూచున్నాను-స్వామీజీని సమీపంగా చూడటంలో కలిగే ఆనందాన్ని అనుభవిద్దామని.

స్వామీజీ వేంచేస్తున్నారని ఓ శిష్యుడొచ్చి భక్తులకు విన్పించేట్టు పెద్దగా చెప్పాడు. అందరూ లేచి నిలబడ్డారు. కాషాయాంబరధారీ-ఆజానుబాహువూ అయిన స్వామీజీ-ముందు నడుస్తున్న శిష్యులు వేద మంత్రోచ్చారణ చేస్తూ ఉండగా-యాగవేదిక మీదికి చేరి పద్మాసనం వేసుకుని కూచున్నారు.

స్వామీజీ మొహం చాలా ప్రశాంతంగా ఉంది. వారి విశాలమైన కళ్ళు దివ్యజ్యోతుల్లా వెలుగుతున్నాయి-వారి పెదవుల మీద చిరుమందహాసం చెదరకుండా ఉంది.

హోమం ప్రారంభమైంది.

రఘు ఏంచేస్తున్నాడో చూడాలనిపించి తలతిప్పి చూశాను. కన్పించలేదు. పాపం రఘు-

కేవలం నా కోసం వచ్చాడు. దేవుడే లేడంటాడు. మనుషుల్లోని మానవత్వమే తాను నమ్మే దేవుడంటాడు. స్వామీజీల వూసెత్తితే చాలు మండిపడతాడు.

"ఓ వేళ దైవచింతనే ముఖ్యమైతే దేవునికీ, భక్తునికీ మధ్యన ఈ స్వామీజీ దేనికి . . . మోక్షం కోసం ఈ స్వామీజీ కూడా ఎవరో ఓ దేవుణ్ణి ప్రార్థిస్తాడు కదా – అదే దేవుణ్ణి భక్తులు నేరుగా ప్రార్థిస్తే చాలదా" అంటాడు.

నేనూ, రఘూ ఒకే కాలేజీలో డిగ్రీ చేశాం. దేవుని మీద నమ్మకం విషయంలో తప్ప మిగతా అన్ని విషయాల్లో మా అభిరుచులు, ఆలోచనలు కలవటంతో సాన్నిహిత్యం పెరిగి ప్రేమగా మారింది. ఉస్మానియా యూనివర్శిటీలో రఘు యం.యస్సీ ఫిజిక్స్ చేశాడు– నేను హిస్టరీలో యం.ఏ. చేశాను. ప్రస్తుతం ఇద్దరం ఒకే కాలేజీలో లెక్చరర్లుగా పనిచేస్తున్నాం.

ఓ సంవత్సరం క్రితం నాకు జబ్బు చేసింది. విపరీతమైన తలనొప్పి . . . వాంతులు . . . ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. అన్ని రకాల వైద్య పరీక్షలూ చేయించాం. ఏ దోషమూ లేదన్నారు. అల్లోపతీ వదిలేసి హోమియో మందులు వాడాను. గుణం కన్పించలేదు. అన్నం సయించేది కాదు. తల గోడకేసి బాదుకుని పగులగొడ్తే బావుంటుందనిపించేది. ఒక్క నెల రోజుల్లోనే పది కేజీల బరువు తగ్గి–ఎముకల పోగులా మారిపోయాను.

విసిగి, వేసారి జీవితం మీద విరక్తి పెంచుకోబోతున్న తరుణంలో నా స్నేహితురాలు విమల చెప్పింది "స్వామీజీ తాకితే చాలు–ఎటువంటి జబ్బైనా నయమైపోతుందని."

"హంబక్" అన్నాడు రఘు. "అబ్రహం కోవూర్ రాసిన పుస్తకాలిస్తాను–చదవండి. బాబాల్నీ, స్వామీజీలను నమ్మటం ఎంత మూఢత్వమో మీకే అర్థమౌతుంది" అన్నాడు విమలతో.

మందులు వాడీ వాడీ బేజారై ఉన్న నేను "ప్రయత్నిస్తే వచ్చే నష్టమేం లేదుగా" అన్నాను. విమల నన్ను వెంట పెట్టుకుని తనకు తెల్సిన కొంతమంది దగ్గరకు పిల్చుకెళ్ళింది.

వాళ్ళు–స్వామీజీ ఎంత గొప్పవారో, ఎంత మహిమ గలవారో, వారు తాకితేనే తమ రోగాలు చేత్తో తుడిచేసినట్లు ఎలా మాయమై పోయాయో పూసగుచ్చినట్టు చెప్పారు.

నాలో ఆశ మొలకెత్తింది. ఇంకొంతమంది నోటి ద్వారా స్వామీజీ గురించి విన్నాక ఆశ బలపడి నమ్మకంగా మారింది.

స్వామీజీ మరో రెండ్రోజుల్లో బాంబేలో ఉన్న తమ ప్రధాన ఆశ్రమానికి వెళ్ళిపోతారని తొందరపెట్టి–విమల నన్ను ఆశ్రమానికి పిల్చుకెళ్ళింది.

"నీ ఇష్టాలు నాకు నచ్చకున్నా–నీ నమ్మకాలతో నేను విభేదించినా–నీ జీవిత భాగస్వామిగా వాటిని గౌరవిస్తాను" అని పెళ్ళికి ముందు మాటిచ్చిన రఘు మాతోపాటు ఆశ్రమానికొచ్చాడు.

విమల దగ్గరుండి నన్ను స్వామీజీ వద్దకు తీసుకెళ్లి నా అనారోగ్యం గురించి చెప్పింది. స్వామీజీ నా కళ్ళల్లోకి వాత్సల్యంగా చూస్తూ-తన కుడిచేతి చూపుడు వేలితో నా నుదురు తాకి "నీకేం ఫర్లేదు. నేనున్నాను. అంతా బావుంటుంది" అన్నారు.

ఆశ్రమం నుంచి తిరిగి వచ్చాక తలనొప్పి కొద్దిగా నెమ్మదించినట్లనిపించింది. ఆ రోజు కొద్దిగా తినగలిగాను. మరునాడు మరికొంత బాగుందనిపించింది. వారం తిరిగేసరికి తల నొప్పి పూర్తిగా తగ్గిపోయి-ఆకలి వేయటం ఆరంభించింది. మంత్రం వేసినట్లు రోగం తగ్గిపోవటం చూసి నేను ఆశ్చర్యపోయాను. అప్పటినుంచీ స్వామీజీకి పరమ భక్తురాలినైపోయాను. హోమం అయిపోయింది. మామూలుగా అయితే స్వామిజీ ప్రసంగం ఉండాలి. కానీ వారికి సుస్తిగా ఉందని, స్వామీజీ విశ్రాంతి తీసుకుంటారని ఓ శిష్యుడు భక్తులందరికీ చెప్పాడు.

బైటికొచ్చాక రఘు అడిగాడు-"అందరి అనారోగ్యాలూ తగ్గించే స్వామీజీకి అస్వస్థత ఏమిటీ?" అని. అతని స్వరంలో జీరాడుతూ వ్యంగ్యం . . .

"స్వామీజీ శిష్యులు చెప్తుంటే వినలేదా . . . ఎవరో భక్తుడు అనారోగ్యంగా ఉన్నాడట . . . అది తగ్గించటం కోసం స్వామీజీ ధ్యానంలో కూచుని అతని అనారోగ్యాన్ని తన శరీరంలోకి తీసుకున్నారట . . . ఎంతటి కరుణామయులో స్వామీజీ" అన్నాను అతని వ్యంగ్యాన్ని పట్టించుకోకుండా. రఘు ఇంకేమీ మాట్లాడలేదు. మాట్లాడినా నిష్ప్రయోజనం అనుకున్నాడేమో.

*****

స్వామీజీని ఇంటికి ఆహ్వానించి పాదపూజ చేయాలని కోరిక. రఘుతో అంటే "నీ ఇష్టం" అన్నాడు.

సాయంత్రం నాల్గింటికి విమల వాళ్లింట్లో పాదపూజ ఉంది. వాళ్లు భార్యాభర్తలిద్దరూ స్వామీజీకి పరమభక్తులు. ప్రతి సంవత్సరం స్వామీజీని ఇంటికి ఆహ్వానించి పాదపూజ చేస్తారు.

విమల వాళ్లింటికెళితే ఆచరించాల్సిన పద్ధతులూ, చేయాల్సిన ఏర్పాట్లు తెలుస్తాయని బయల్దేరాను. నాతో పాటే రఘూ వచ్చాడు.

విమల భర్త పేరుమోసిన కాంట్రాక్టర్. బాగా సంపాయించాడు. బంజారాహిల్స్‌లో అతని ఇల్లు రాజభవనంలా ఉంటుంది.

మేం వెళ్ళేప్పటికి యిల్లంతా గులాబీ పూలతో అలంకరించారు. యింటి ముందు ఆకాశమంత కాకున్నా, అలా అన్పించేంత పెద్ద పందిరి వేశారు. ప్రవేశద్వారం దగ్గిర పూలతో అల్లిన కర్టెనా అన్పించేట్లు పొడవాటి మాలలు కట్టారు-పూల పరదా తొలగించుకుని లోపలికి వెళితే పన్నీరు వాసన పల్కరించేలా . . .

విశాలమైన హాల్లో ఖరీదయిన తివాచీ పరిచి ఉంది. హాల్లోని మిగతా ఫర్నీచర్ అంతా తీసేసి స్వామీజీ కోసం ఉచితాసనం ఏర్పాటు చేశారు. స్వామిజీకి మెత్తగా ఉండడం కోసం దాని మీద పట్టుపీతాంబరాలు పరిచారు. రెండు బుట్టల నిండా గులాబీ రేకులు తయారుగా ఉంచుకున్నారు.

సరిగ్గా నాలుగు గంటల ఇరవై నిమిషాలకు స్వామీజీ తన ఖరీదయిన మెర్సిడెస్ కారులో వేంచేశారు. మంగళ వాయిద్యాలు మోగుతుండగా-శిష్యులు వేద మంత్రోచ్చారణ చేస్తుండగా-విమలా, ఆమె భర్తా స్వామీజీకి చెరోవైపూ నిలబడి గులాబీ రేకుల్ని వారి పాదాలపై చల్లుతూ ఉండగా-చిరు మందహాసం ఇరువైపులా విసిరేస్తూ-స్వామీజీ తమ ఆసనం మీద కూచున్నారు.

కడు భక్తి ప్రపత్తులతో విమల దంపతులు వారి పాదాల ముందు వెండి పళ్ళెం ఉంచి స్వామీజీ పాదపద్మాల్ని పన్నీటితో కడిగి-తల మీద చల్లుకున్నారు.

స్వామీజీ గాల్లోకి చేయి తిప్పి విభూది సృష్టించారు. వాళ్లిద్దరి నుదుటిని కుడిచేతి బొటన వ్రేలితో తాకి విభూదిని వాళ్ళద్దరి చేతుల్లో వేశారు. వెంటనే వాళ్ళిద్దరూ సాష్టాంగ నమస్కారం చేసి వాళ్ళ తలల్ని స్వామీజీ పాదాల దగ్గర ఉంచారు.

స్వామీజీ పాలు మాత్రమే సేవిస్తారంటే-వెండి గ్లాసులో చిక్కటి పాలు తెచ్చిచ్చింది విమల. ఆమె, ఆమె భర్తా చెరోవైపు నిలబడి నెమలి ఈకలున్న వింజామరల్తో విసుర్తుండగా -స్వామీజీ చిద్విలాసంగా పాలను చప్పరిస్తూ-తివాచీ మీద కూచున్న భక్తుల వైపు వాత్సల్యంగా చూశారు.

స్వామీజీ భక్తుడొకడు నా దగ్గరకొచ్చి నోటికి అరచేతిని అడ్డంగా పెట్టుకుని, "పాద పూజలకు ఇంటికి ఆహ్వానించాలంటే మొదటగా స్వామీజీ అంగీకారం తీసుకోవాల"ని గుసగుసగా చెప్పాడు.

నేను స్వామీజీ ముందుకు ఒదిగి ఒదిగివెళ్ళి-వారి ముందు మోకాళ్ళ మీద కూచుని మంద్రస్వరంతో వారిని ఆహ్వానించాను.

స్వామీజీ చిరునవ్వుతో నా వైపు చూశారు. అదే అంగీకారం-స్వామీజీ ఎక్కువ మాట్లాడరు.

నేను తిరిగొచ్చి రఘు పక్కన కూచున్నాక-ఇందాకటి భక్తుడే మరలా మెల్లగా చెప్పాడు "మీరు పాదపూజకు పది వేలు కట్టాలి. మీకు రశీదు ఇస్తారు. స్వామీజీ వచ్చే తేదీ, సమయం వారి వీలుని బట్టి మీకు తెలియజేస్తారు"

"పదివేలా!" అన్నాను ఆశ్చర్యంగా . . . అయినా అతి మెల్లగా . . . అది నా రెణ్ణెల్ల నెట్ శాలరీ.

"స్వామీజీకి పాదపూజలు చేయాలనుకునే భక్తుల సంఖ్య చాలా ఎక్కువగా ఉందమ్మా-స్వామీజీ అలసిపోతున్నారు. అంతటి శ్రమను తట్టుకోలేకపోతున్నారు. అందుకే అతి ముఖ్యమైన

వాళ్ళకే అటువంటి మహదవకాశం ఇవ్వాలని పాదపూజ ఫీజు పదివేలుగా నిర్ణయించారు" అన్నాడతను.

"భక్తి కాదన్మాట ప్రధానం. అతి ముఖ్యమైన వాళ్ళంటే డబ్బున్న వాళ్ళు" అన్నాడు రఘు నాకే విన్పించేంత మెల్లగా . . .

"రెండు మూడు రోజుల్లో ఆశ్రమానికొచ్చి పది వేలు కడ్తాను" అన్నాను.

"పైన ఫ్యాన్ అంత వేగంగా తిరుగుతున్నా వింజామరల్తో వీచటం ఎందుకో నాకర్థం కాలేదు" అన్నాడు దారిలో రఘు.

నేను సమాధానం ఇవ్వకుండా, "వారి మొహంలోని తేజస్సు గమనించావా?" అన్నాను.

"పాలూ, నెయ్యీ బాగా తిని స్వామీజీ శరీరం పుష్టిగా, నున్నగా, నిగనిగలాడ్తున్నట్లు తయారయింది. ఇక మొహంలోని దివ్యతేజస్సంటావా... రేపెలా గడుస్తుందోనన్న దిగులు లేకపోతే-ఫలానా పని చేయకపోతే బాస్ తిడ్తాడేమోనన్న భయం లేకపోతే-వద్దన్నా వచ్చి పడే లక్షల డబ్బుంటే-పాద పూజలు అందుకోవటం 'మాత్రమే' పని అయితే-మనందరి మొహాల్లోనూ అంత తేజస్సు ఉంటుందనుకుంటా" అన్నాడు.

*****

విమల వాళ్లింటి నుండి వచ్చినప్పటి నుండీ సన్నగా తలనొప్పి . . . రాత్రికి మరీ ఎక్కువైంది. తల బద్దలైపోయేంత తలనొప్పి . . . అన్నం సయించలేదు . . . వాంతికొస్తున్నట్లు ఫీలింగ్.

మరలా స్వామీజీ తమ అమృతహస్తాల్తో తాకితేగాని తగ్గదనిపించే తలనొప్పి . . .

"రఘూ-వెంటనే బయల్దేరు. ఆశ్రమానికి వెళ్ళాలి" అన్నాను ఉదయాన్నే నేను రెడీ అవుతూ.

రఘు పెద్దగా నవ్వాడు. ఓ నిమిషం వరకూ ఆపకుండా నవ్వాడు. నా కోపం చూసి నవ్వును ఆపుకోటానికి ప్రయత్నిస్తూ అన్నాడు "యు విల్ బికం వాట్ యు థింక్-నువ్వేం ఆలోచిస్తావో అదే అవుతావు అంటారు మానసిక శాస్త్రవేత్తలు. అంతా మనసు చేసే మాయ. శరీరం మనసుకు బానిసలా-చెప్పినట్లు నడుచుకుంటుంది. స్యూడో ప్రెగ్నెన్సీలు, సైకో సొమాటిక్ రుగ్మతలు . . . ఇందుకు నిదర్శనాలు . . . దీపక్ చోప్రా తన 'క్వాంటం హీలింగ్' అనే పుస్తకంలో చెప్పిన విషయం అదే. మనిషికి మనసు అద్భుతమైన వరం-దాన్ని అదుపాజ్ఞల్లో పెట్టుకోకపోతే అదే భయంకరమైన శాపం."

"ఏమో-నాకివేవీ తెలియవు. ఏ డాక్టరూ నయం చేయలేని రోగాన్ని స్వామీజీ తగ్గించారు. నాకు తెలిసిందే ఇదే."

"అలా తగ్గటంలో ఆశ్చర్యం ఏముంది? స్వామీజీ తాకితేనే జబ్బు తగ్గుతుందని నీవు బలంగా నమ్మావు. అందరూ కలిసి ఆ విధంగా నీకు హిప్నాటిక్ సజెషన్స్ ఇచ్చారు. దానికి నీ ఆటో సజెషన్స్ కూడా తోడై నీవు ఆశించింది జరిగింది. అంతశ్చేతన ఆడిన నాటకం అది. ఈ రోజు పేపర్లో చూళ్లేదా-రోగికి స్వస్థత చేకూరాలని అతని చుట్టూ నిలబడి, వరుసగా వారం రోజులు వంతులవారీగా ప్రార్థించారట. అతని రోగం తగ్గిపోయింది. అదేమీ మాయో, మహిమో కాదు, ఓ బలమైన నమ్మకం. నీ ఆరోగ్యం గురించి పాజిటివ్ సజెషన్స్ ఇచ్చుకో. నీకే రుగ్మతలూ ఉండవ్"

"నాకీ లెక్చర్లు వద్దు. మనం ఆశ్రమాని కెళ్ళాలి. అంతే. వస్తావా రావా" అన్నాను విసుగ్గా.

"నీ ఇష్టం-పద" అన్నాడు తను కూడా రెడీ అవుతూ.

మేము ఆశ్రమానికెళ్ళి వాకబు చేస్తే స్వామీజీ విజయవాడ వెళ్ళారని తెల్సింది.

అక్కడి భక్తులకు పాదపూజలు చేసుకునే భాగ్యాన్ని ప్రసాదించి రెండ్రోజుల తర్వాత తిరిగి వస్తారట.

నేను హతాశురాలినైనాను. అగాధంలోకి వేగంగా జారిపోతున్న భావన. ఉన్న ఒక్క ఆధారమూ చేజారి-నీళ్ళలో వూపిరాడకుండా కొట్టుకుంటున్న ఫీలింగ్ . . .

"రఘూ-ఈ రోజు కాలేజీకి శెలవ పెట్టేద్దాం. మనం విజయవాడ వెళ్ళి స్వామీజీని కల్సుకుందాం. తొందరగా ఇంటికెళ్ళి బట్టలు సర్దుకుందాం పద. ఏదో ఒక బస్ దొరక్క పోదు" అన్నాను

రఘు నా వైపు విస్మయంగా చూశాడో క్షణం.

ఇంటికి బయల్దేరాం. మధ్య దారిలో "వైదేహి ఆశ్రమంలో నాకో పది నిమిషాల పనుంది. ఇక్కడికి ఆశ్రమం చాలా దగ్గర. వెళ్దామా?" అన్నాధు.

నాకు విపరీతమైన తలనొప్పిగా ఉంది. వళ్ళు తూలుతున్నట్లు . . . కళ్ళు తిరుగు తున్నట్లు . . . వీలైనంత తొందరగా ఇంటికెళ్ళి విజయవాడకు ప్రయాణం కావాలని ఉంది. అయినా రఘు అడిగింది కాదనలేక సరే అన్నాను.

మేం వెళ్ళి బయటి గేట్ తీయగానే ఇద్దరాడపిల్లలు మాకెదురొచ్చి నమస్కారం చేశారు. ఇద్దరూ పదేళ్ళలోపు పిల్లలే. ఆ కాంపౌండ్ లోపల ఓ కిచెన్ రూం, మరో పెద్ద హాల్ మాత్రమే ఉన్నాయి. పెరట్లో రకరకాల కూరగాయల మొక్కలు ఉల్లాసంగా తలలూపుతున్నాయి. ఈ అనాథ పిల్లలకు ఆహారంగా ఉపయోగపడ్తున్నందుకు అవీ సంతృప్తితో కదుల్తున్నట్లనిపించింది.

"ఈ అశ్రమం అనాథ ఆడపిల్లల కోసం ప్రారంభించారు. ప్రస్తుతం ఇరవై నాలుగు మంది

ఆడపిల్లలున్నారు. రెండేళ్ళ నుండీ పదేళ్ళ వయసులోపు పిల్లలు . . . ” లోపలికి ప్రవేశిస్తున్నప్పుడు ఉపోద్ఘాతంలా చెప్పాడు రఘు.

మాకు హాల్లో రెండు కుర్చీలు వేసి కూచోపెట్టారు. పిల్లలందరూ వచ్చి మా ఎదురుగా వరుసల్లో కూచున్నారు. వాళ్ళందరూ హుషారుగా, ఉల్లాసంగా కన్పించారు.

వాళ్ళతోపాటే వచ్చిన స్త్రీని రఘు పరిచయం చేశాడు. “నీకెప్పుడూ చెప్తుంటాను చూడు సత్యవతిగారని–వీరే. ఈ పిల్లలందరికీ అమ్మ తనే. జీవితాన్ని వీళ్ళ సేవ కోసమే అంకితం చేసిన స్త్రీమూర్తి”

ఆ పొగడ్తకనుకుంటాను– ఆమె ఇబ్బందిగా కదలటం గమనించాను. ఆమెకు నలభై పైనే వయసుంటుంది. తను చేస్తున్న సేవ మనస్ఫూర్తిగా చేస్తున్నట్లు . . . ఆమె మొహంలోని ప్రసన్నతే చెప్తుంది. పిల్లల మొహాల్లోకి పరిశీలనగా చూశాను. ఆరోగ్యంగా, ఆనందంగా ఉన్నాయా మొహాలు. మేము అనాథలం అనే భావం గుచ్చుకుంటూ, గాయం చేస్తూ వాళ్ళ కళ్ళలో కన్పిస్తుందేమోననుకున్నాను. కానీ అటువంటి ఛాయలు మచ్చుకైనా కన్పించలేదు. దానిక్కారణం సత్యవతిగారి ప్రేమ–వాత్సల్యం అయి ఉంటుంది. ఇరవై నలుగురు ఆడపిల్లల పెంపకం ఎంత కష్టం! మా ఇద్దరు పిల్లల్ని పెంచటానికే ఎంత సతమతమవుతున్నామో మాకు తెలుసు. అలాంటిది ఇంతమందికి జడలు . . . స్నానాలు . . . బట్టలు . . . చదువులు . . . వంటలు . . . సత్యవతిగారికి మనసులోనే అభివందనం చేశాను.

“మొట్టమొదటిసారి మేడం మన ఆశ్రమానికొచ్చారు. మీ పరిచయాలు చేస్కోండి” అంది సరస్వతి పిల్లల్ని ఉద్దేశించి.

ఒక్కో అమ్మాయి లేచి నిలబడి తన పేరూ–తరగతీ చెప్పింది. చివర్లో రెండేళ్ళ పాప నిలబడి–చేతులు కట్టుకుని “నా పేలు సేత” అంది. అందరూ నవ్వారు. సత్యవతి కూడా నవ్వి, “మా ఆశ్రమంలో అందరికంటే చిన్నపిల్ల ఇదే. పేరు శ్వేత. మీ వారు ధన సహాయం చేస్తున్నది ఈ పిల్ల కోసమే” అన్నారు.

ఆ పాప అందమైన నవ్వు అయస్కాంతంలా ఆకర్షిస్తోంది. లేత గులాబీ రేకుల మీద మెరిసే తుహినకణంలా స్వచ్ఛమైన నవ్వు . . . చేతులు చాపాను. మెల్లగా నడుచుకుంటూ దగ్గరకొచ్చి నిలబడింది. ఎత్తుకుని ఒళ్లో కూచోబెట్టుకున్నాను.

“ఈ పిల్ల అమ్మా నాన్న కూలికెళ్ళి తిరిగి వస్తూ లారీ యాక్సిడెంట్‌లో చనిపోయారు” సత్యవతి చెప్పింది విని మనసు బరువైంది. ఇలా విధివంచితులై దిక్కూ మొక్కూలేని పసిపిల్లలు ఎంతమంది ఉంటారో . . . ఎన్ని లక్షల అనాథాశ్రమాలు వెలిస్తే వారి జీవితాలు మొగ్గలోనే

వాడిపోకుండా ముద్దమందారాల్లా విరుస్తాయో!

"వీళ్ళు ఏ స్కూల్లో చదువుకుంటున్నారూ" అడిగాను.

"ఈ దగ్గర్లోనే ఓ స్కూలుంది. మా పిల్లలకు ఫ్రీగా చదువు చెప్తారు. పుస్తకాలు, నోటుబక్కులు కూడా వాళ్లే కొని పెడ్తారు. సాయంత్రాలు ఆ స్కూలు టీచరే వచ్చి పిల్లలకు ఉచితంగా ట్యూషన్ చెప్తుంది" అంది సత్యవతి.

"మరి వీళ్ళ బట్టలు . . ."

"మీలాంటి దాతలిచ్చిన డబ్బుతో వీళ్ళకు సంవత్సరానికి రెండు జతల బట్టలు కుట్టిస్తాం. నాకు టైలరింగ్ వచ్చండీ. మెషిన్ తెప్పించి నేనే కుడ్తాను. ఎవరైనా పాత బట్టలు దానం చేస్తే అవీ వాడుకుంటారు"

"కొత్తవాళ్లను ఎలా చేర్చుకుంటారూ"-ఈ ఆశ్రమం గురించి ఇంకా తెల్సుకోవాలన్న కుతూహలం నాలో.

"మేం మొదట అనుకున్నది పాతిక మంది పిల్లల్ని చేర్చుకోవాలని. కానీ ఇరవై నలుగురితోనే ఆపేయాల్సి వచ్చింది. ఇపుడు కొత్తవాళ్ళు వచ్చినా చేర్చుకునే ఆర్థిక స్థోమత లేదు"

"ఎందుకని?"

"మా ఆశ్రమంలో ఉన్న ఒక్కో అమ్మాయికి ఒక్కో దాత నెలకు అయిదు వందల చొప్పున విరాళం ఇస్తారు-ఆ పిల్ల పోషణార్థం. ఆ పిల్ల పెద్దయి చదువులన్నీ అయిపోయే వరకూ నెల ఖర్చులు దత్తు తీసుకున్న వాళ్ళే భరించాలి. కానీ మధ్యలో చాలామంది మానేస్తుంటారు. మేం కొత్త దాతల కోసం వెతుక్కుంటూ ఉంటాం. ఓ ముసలావిడ ఎప్పటి నుండో తిరిగిపోతుంది. ఆమె కోడలు పురిట్లోనే చనిపోయిందట. కొడుకు వేరే పెళ్ళిచేసుకుని వెళ్ళిపోయాడట. వీళ్ల అతీగతీ పట్టించుకోడట. నాలుగేళ్ళ తన మనవరాల్ని చేర్చుకుంటే తనేదైనా వృద్ధుల ఆశ్రమానికి వెళ్ళిపోతానని ఆరు నెలల నుంచీ అడుగుతోంది. కానీ సరైన దాత దొరక్క వెనుకా ముందూ ఆడుతున్నాం."

రఘు ఆ నెలకివ్వాల్సిన అయిదు వందలు కట్టి రశీదు తీసుకున్నాడు.

"పిల్లలూ, ఓ పాట పాడండి . . . మేడం వింటారు" అంది సత్యవతి.

పిల్లలందరూ ముక్తకంఠంతో "నాదు జన్మభూమికంటె నాకమెక్కడుంది-సురలోక మెక్కడుంది" అంటూ శ్రావ్యంగా పాడారు.

మేం స్కూటర్ ఎక్కి బయల్దేరేటపుడు పిల్లలు-సత్యవతి బైటికొచ్చి మాకు వీడ్కోలు చెప్పారు.

ఈ ఆశ్రమం గురించి రఘు చెపితే వినటం తప్ప రావటం ఇదే మొదటిసారి. దారిలో

మేమిద్దరమూ ఏమీ మాట్లాడు కోలేదు. ఇంటికెళ్లాక "నీ తలనొప్పి ఎలా ఉంది" అని రఘు అడిగే వరకు నేను గమనించనేలేదు-నా తలనొప్పి తగ్గిపోయిన విషయం.

*****

"తొందరగా లే. బోల్డు పనుంది" రఘుని తట్టి లేపాను.

"ప్లీజ్ అరుణా. ఇంకా అయిదు కూడా కాలేదు" అన్నాడు దుప్పటి పైకి లాక్కుంటూ.

"అయిదు కాకపోవటమేమిటి-ఆరైంది. లే . . . మనం ఆశ్రమానికెళ్ళాలి"

ఆ మాట వినగానే రఘు మారుమాట్లాడకుండా రెడీ అయ్యాడు.

"పది వేలు పెట్టుకుంటే చాలు కదూ" అంటూ నా జవాబు కోసం చూడకుండా ఐదు వేల రూపాయల కట్టలు రెండు, ప్యాంట్ జేబులో పెట్టుకున్నాడు.

"స్వామీజీ ఆదివారం వస్తే బావుంటుంది. లేకపోతే మనిద్దరం ఓ రోజు శెలవ పెట్టాల్సి వస్తుంది" అన్నాడు దారిలో.

నేనేమీ మాట్లాడలేదు.

కొంతదూరం వెళ్ళాక "రఘూ! నీకు స్వామీజీలంటే నమ్మకం లేదుకదా. పాద పూజ కోసం నేను పది వేలు ఖర్చు చేయటం నీకు కోపం తెప్పించటం లేదా?" అని అడిగాను.

రఘు నవ్వటం నాకు విన్పించింది. "ఎందుకూ కోపం? నీవు విద్యావంతురాలివి. విజ్ఞత కలదానివి. ఎవరి నమ్మకాలు వారివి. నీకు సంతోషం కలిగించే పని - అది స్వామీజీ పాదపూజైనా సరే-నాకు అభ్యంతరం అన్పించదు"

గాల్లో తేలిపోతున్న దివ్యానుభూతి . . . మాటల్లో ఎంత బలం ఉంటుందీ! ఒక్కో మాట అణుబాంబులా పేలి నాశనమూ చేయగలదు . . . మందానిలంలా తాకి మైమరపించనూ కలదు.

"నువ్వెంత మంచివాడివో" అన్నాను ప్రేమగా . . . అతని భుజం మీదున్న నా చేయి 'నిజం' అన్నట్లు స్పర్శ ద్వారా ఆ విషయాన్ని అతనికి మరోసారి నొక్కి చెప్పింది.

పొగడ్తకనుకుంటాను- స్కూటర్ వేగం పెరిగింది.

మైకం లోంచి ఒక్కసారిగా బైటపడి "ఇటెక్కడికీ" అని అడిగాను.

సడన్‌గా బ్రేకు వేసి "ఇటేగా స్వామీజీ ఆశ్రమం" అన్నాడు రఘు.

"మనం వెళ్తున్నది ఆ ఆశ్రమానికి కాదు . . . వైదేహీ ఆశ్రమానికి. ఇరవై ఐదో అమ్మాయిని నేను దతత్త తీసుకోబోతున్నాను" అన్నాను.

*(రచన ఇంటింటి పత్రిక, డిసెంబర్ 2001)*